# 4. సాహిత్యంలో తొడలు

తొడల తార, తొడల డాన్సు, తొడల సినిమా, తొడల పాటలు, తొడల కవి-లాంటి క్రొత్త మాటలు ఇటీవల సినిమా పరిభాషలో ఊతపదాలుగా స్థిరపడిపోయాయి. సినిమాలు కనీసం ఈ రూపేణానన్నా భాషాసేవ చేస్తున్నందుకు సంతోషించవలసిందే. మొత్తం మీద సినీ సేవకులూ, ప్రియులూ కలసి అశ్లీలం, బూతు అనే వాటికి-తొడ-అనే పర్యాయపదాన్నొకదాన్ని సృష్టించేశారు.

తొడల కవి అనే దొకటి మాత్రం కాస్త ఎబ్బెట్టుగా వినిపిస్తోంది కాని మన కవుల్లో తొడయోధులు చాలామందే ఉన్నారని ఇటీవలి కవితా యుద్ధాల్లో రుజువయింది. ఇదంతా చూస్తూ, వింటూ ఉంటే అసలు బూతు-లేదా అశ్లీలం అంటే ఏమిటి? అది భాషలో ఉందా లేక దాన్ని ఉపయోగించే తీరులో, సందర్భంలో ఉందా? అనే తొడ సందేహం కలగటం సహజం.

వెనక మనసాహిత్య అకాడమీకి శ్రీ కృష్ణదేవరాయల వారు ప్రెసిడెంటుగా ఉన్న రోజుల్లో వార్షిక సాహిత్య తద్దినాలుగాక నిత్యనైవేద్యాలు జరుగుతూండేవి.

అలాంటి సాహిత్య స్వర్ణదినాల్లో అనుదినం పెద్దనాది అష్టదిగ్గజాలు తాము తాజాగా అల్లిన లేదా రుబ్బిన శృంగార, భావ, వీర, స్తోత్ర ఇత్యాది అక్షరకాల కవితనూ మన రేడియో కవుల్లా గొంతెత్తి రాగ, భావ, తాళ యుక్తంగా రాయల వారికీ నైవేద్యం చేశేవారు. ఓ సుప్రభాతాన యథావిధిగా రాయలవారి సాహిత్య అకాడమీ ఎగిక్యూటివ్ మీటింగ్-కమ్-కవితా గోష్ఠి జరుగుతూండగా ఓ నవకవి సింహుడు ప్రవేశించి "రాజేంద్రా! మీ అష్టదిగ్గజాల్లో నే నిచ్చే పద్యపూరణం చేయగల ఘనులున్నారా!" అని ప్రశ్నించి......

రాయలవారు "హాఁ!...!" అనగా..."అయినచో పూరింపుడు." అని "కుంజర యూధంబు దోమ కుత్తుక సొచ్చెన్" అని ఓ రెండు పాదాలిచ్చి కూర్చున్నాడట.

ఏనుగేమిటి? దోమ నోట్లో దూరటమేమిటి? దీన్నెలా పూరించటమని పెద్దనాది అకాడమీ విశిష్ట సభ్యులెల్లరూ బుర్రలూ, బొర్రలూ, పిర్రలూ గోక్కుంటూండగా...

"పాండురోగ మహాత్మ్యం" దిద్దుకుంటూన్న తెనాలి రామలింగడు ఠపీమని లేచి...

"గంజాయి తాగి, తురక సంజాతల కూడి, కల్లు చవి చూచితివా! లంజల కొడకా! ఎక్కడ కుంజరయూధంబు దోమ కుత్తుక సొచ్చెన్?" అని పూరించి పారేసి మళ్ళా ఠపీమని కూర్చున్నాడట.

ఆ బండబూతులు వినీ వినగానే ఆ నవ కవి సింహుడు

'ఢా' మ్మని చతికిలబడి ఏడుపు మొహం పెట్టగా, పెద్దనాదు లెల్లరు, హామ్మయ్య! పరువు దక్కిందని గాలి పీల్చుకుని దిగంబరుల్ని మెచ్చుకున్న శ్రీశ్రీలా "షెబ్బాష్! రామలింగా!" అని ప్రశంసించేరట.

కానీ, రాయల వారెంత దక్షిణ నాయకుడయినా సాహిత్య అకాడమీ ఛైర్మన్ గదా! అందుకని వారు కాస్త నొచ్చుకుని అదేమి! "రామలింగా! తోటి కవి నిట్లు తిట్టుట భావ్యమా? ఇటులనా కవితను పూరించుట!" అని మందలించగా...!

అసలే తన "పాండురోగ మహాత్మ్యం"కు ఆ ఏడాది అకాడమీ వాళ్ళు ఉత్తమ నవల బహుమతీ, వెయ్యిన్నూటపదహార్లూ ఇవ్వనందుకు మండిపోతున్న రామలింగడు కోపంగా లేచి...

"కాని, ఛైర్మన్ సాబ్! ఈ తర్కకవిగారు ఇలాంటి చెత్త పద్యాలిచ్చి పూరించమనగా లేనిది నేను పూరిస్తే వచ్చిందా అసభ్యత? సరే! మరల పూరిస్తాను, చిత్తగించండి" అని...

"రంజన చెడి, పాండవు లరిభంజనులై, విరటుగొల్వ జొల్పడి రకటా...కుంజరయూథంబు దోమ కుత్తుక సొచ్చెన్!" అని పూరించగా ఈసారి రాయలవారు సంతోషించి శ్రీశ్రీ కవిత్వాన్ని మెచ్చుకున్న విశ్వనాథలా "గుడ్! రామలింగా! సిద్ధాస్!" అన్నారట.

కనుక...బూతులనీ, అవనీ, ఇవనీ మనం వాళ్ళనీ, వీళ్ళనీ తిట్టుకో నక్కర్లేదు. వినే వాడి, లేదా చదివేవాడి బుర్ర బండబారినదా లేక ఆర్డర్ లోనే ఉన్నదా అనేదాన్ని బట్టి ఆ బండ లేదా కంట్రోల్డ్ బుర్రలోకి మన భావాల్ని ఇంజెక్ట్ చేసే తీరూ ఉంటుంది మనమంతా నెత్తికెక్కించుకున్న శ్రీనాధుడంతటివాడు ఎవత్తెనో తగులుకుని-ఏగనేరియాయో తగిలించుకుని, చిక్కి శల్యమై, తన ఏడుపేదో తన డాక్టరు వద్ద ఏడవక, దాన్నో ప్రజా సమస్యగా తయారు జేసి "బాబో! భగము కాదది మహోరగము గాని!" అంటూ పబ్లిగ్గా-సిగ్గులేకుండా, బండబూతుగాఏడిస్తే-అయ్యో, పాపం-ఎంతకష్టం" అని మనంకూడా ఇంతకాలం అది చదువుకుంటూ ఏడుస్తూ కూర్చో లేదా! అయితే అందుకు తిట్టాల్సింది శ్రీనాధుణ్ణి కాదు. ఆయనగారి అడ్డమైన రాతల్ని కళ్ళకద్దుకున్న బుర్ర తక్కువ సాహిత్యచైతన్యాన్నే!

ఆధునిక యుగంలోనూ అంతే మర్యాదగా తిట్టినా బండబూతుల్లో కంపుకొట్టేలా తిట్టినా అసలు మనం తిట్టే దెందుకు? పడ తిట్టవలసిం దెవర్ని? భుజంతట్టి నిద్ర లేపవలసిం దెవర్ని? ఎందుకు? ఎలా? అనే సామాజికజ్ఞానం అంటూ ఉంటే అసలీ సమస్యలే రావు

"మానవుడు తన్ను తాను తెలుసుకుని ఆత్మవిశ్వాసం పెంచుకుని సత్యం, న్యాయం కోసం పోరాడేలా చేసి, మానవుడిలోని నైచ్యతను నిర్మూలింపజేయటానికి, ఉత్తమ గుణా

ల్ని త్తేజితం చేస్తూ అధర్మంమీద క్రోధం, దౌర్జన్యానికి సిగ్గు పడటం, న్యాయరక్షణకు ధైర్యం, సౌందర్యంపట్ల ప్రేమ-పెంచ గలిగేదే ఉత్తమ సాహిత్యం" అన్నాడు గోర్కీ.

దీన్నర్థం చేసుకున్న కవిగాడెవడూ ఏ పరిణామానికైనా కారణభూతుడు కావలసి ఉన్న మానవుడిని "లేరా! నిద్రలేవరా లమ్డీకొడకా!" అని తిట్టలేదు. తిట్టినా, విన్నవాడు ఓసారి ఉలిక్కిపడి అటు చూసి "అలాగా, పాపం, వీడు ఆఫీసులో చివాట్లుతిని వచ్చినట్లున్నాడు! ఎవర్నో తిట్టుకుంటున్నాడు" అనుకుని, నవ్వుకొని మరలా నిద్రబోతాడు. జరుగుతున్నదిదే!

ఈ తేడా గుర్తించకుండా మన ఆధునిక కవులు గుడ్డిగానో అతి తెలివిగానో తొడలసంగీతం మోగించి ప్రయోజనం శూన్యం. ఈ అజ్ఞానం వలననే ఇక్కడి మన మావో అభిమానులు "సోనార్ బంగ్లా" గీతా ల్నేడుస్తూంటే అక్కడ మావోగారు యాహ్యాసాబ్ భుజం తడుతుండట్నాన్ని మ్రింగలేకా, కక్కలేకా చావాల్సివస్తున్నది.

వెనుక ఎవరో రాశారు; "ఉద్యమనాయకా! చదూకో!" అని. సాహిత్యోద్యమ నాయకులారా! చదూకోండి! తొడల్ని కాదు, మానవుడినీ, జీవితాన్నీ, అనుభవాల్నీ. నేర్చుకోండి గుణపాఠాల్ని.

(మే, 1971)